# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ఆదర్శనీయం

**ఘనంగా వర్ధంతి నివాళులు**

**బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి**



**వేంపల్లె,జూన్23.అక్షర టైమ్స్:-** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, జాతీయవాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా వేంపల్లిలో బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కలకత్తాలో జన్మించిన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉండాలని పోరాడిన గొప్ప దేశభక్తుడని తెలిపారు. "ఏక్ దేశ్ మే దో ప్రధాన్, దో విధాన్, దో నహీ చలేగా" అనే నినాదంతో కాశ్మీర్ అంశంపై ఉద్యమించి, అక్కడే అనుమానాస్పద పరిస్థితుల్లో ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం బెంగాల్ ప్రావిన్స్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా, స్వతంత్ర భారతదేశ తొలి కేంద్ర ప్రభుత్వంలో పరిశ్రమలు మరియు సరఫరాల శాఖ మంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో కాంగ్రెసేతర సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఈశ్వర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, బీజేపీ జిల్లా వాణిజ్య విభాగపు అధ్యక్షుడు దొంతు సుమన్, శ్రీ వృషభాచలేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుడు సునీల్ కుమార్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సౌభాగ్య, రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా


## ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

**యూజీ-26 ప్రవేశాల కౌన్సెలింగ్‌లో నాలుగు రోజుల పాటు విశిష్ట సేవలు**




**వేంపల్లె,జూన్23.అక్షర టైమ్స్:-** ఆర్జీయూకేటీ-ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో నిర్వహించిన యూజీ-26 ప్రవేశాల కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విశిష్ట సేవలు అందించారు. కళాశాలకు సెలవులు ఉన్నప్పటికీ తమ స్వస్థలాల నుంచి వచ్చి నాలుగు రోజుల పాటు ప్రవేశాల ప్రక్రియలో విధులు నిర్వహిస్తూ నిర్విరామంగా సహకరించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను గుర్తించిన డైరెక్టర్ విజయ్ ప్రకాశ్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ప్రతి విద్యార్థి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి తమవంతు సేవ అందించాలని, భారతదేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డా. రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. జె. దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్స్ రమేష్ కైలాస్, తిరుపతి రెడ్డి, అనిత, కోటేశ్వరి, సుబ్బారాయుడు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో యూజీ-2026 తొలి విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ ముగింపు

**822 మంది విద్యార్థులకు ప్రవేశాలు.. రెండో విడత ఎంపిక జాబితా త్వరలో విడుదల: డైరెక్టర్ విజయ్ ప్రకాష్**



**వేంపల్లె,జూన్23.అక్షర టైమ్స్:-** ఆర్జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో యూజీ-2026 మొదటి విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మొత్తం 1010 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా, 822 మంది విద్యార్థులు హాజరై ప్రవేశాలు పొందారు. నాలుగు క్యాంపస్‌లకు సంబంధించి మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండో విడత ఎంపిక జాబితాను త్వరలో ఆర్జీయూకేటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ విజయ్ ప్రకాష్ తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన అడ్మిషన్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన అధికారులు, సిబ్బందిని డైరెక్టర్ విజయ్ ప్రకాష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌ల పరిపాలనాధికారులు డా. పి. రవి కుమార్, ఎన్. చంద్రశేఖర్, డీన్ అకాడమిక్స్ డి. రమేష్ కైలాష్, ఎం. రూపస్ కుమార్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డా.జి. వెంకటేష్, అసోసియేట్ డీన్లు రాఘవ రెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, తిలక్, ఐటీ ఇన్‌ఫ్రా కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు బిన్నీ, ఓబయ్య, కోనప్ప, రాము, దీప్తి, భాస్కరయ్య, పీఆర్ఓ డా. తిరుపతి రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు అన్నదానం







**బద్వేల్,జూన్23.అక్షర టైమ్స్:-** బద్వేల్ పట్టణంలోని సుమిత్ర నగర్ లో ఉన్న షాలోమ్ అనాధాశ్రమం ఆశ్రమంలో మంగళవారం బి. మఠం మండలంపెద్దిరాజుపల్లె గ్రామానికి చెందిన దొరబాబు, సుస్మిత ల కుమారుడు ఆశిష్ రామ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకురాలు దేవసుధ మాట్లాడుతూ అన్నదానం చాలా పుణ్యకార్యమని అనాధ పిల్లల సమక్షంలో పుట్టినరోజు జరుపుకొని అన్నదానం చేయడం చాలా సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణం దానగుణం కలిగి ఉండాలన్నారు.

## విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలి

**బద్వేల్ లో విద్యుత్ ఉద్యోగుల నిరసన**



**బద్వేల్,జూన్23.అక్షర టైమ్స్:-** విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థల విలీనం చేయాలంటూ మంగళవారం బద్వేల్ లో విద్యుత్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. బద్వేల్ సెక్షన్ నందు స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు వనిపెంట ప్రసాద్, సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగుల ఏప్రిల్ 2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో 3కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతాయన్నారు.అలాగే విద్యుత్ సబ్ స్టేషన్ లు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ, రామచంద్రుడు, లోకేష్, అబ్దుల్ వలీ,తదితర నాయకులు పాల్గొన్నారు.

# రెండు చుక్కలతో అంగవైకల్యాన్ని నివారించండి

**తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్**

**బద్వేల్,జూన్23.అక్షర టైమ్స్:-** 0 నుండి 5 సంవత్సరాలు గల పిల్లలకు పల్స్ పోలియో రెండు చుక్కలను వేసి, అంగవైకల్యాన్ని నివారించాలని తొట్టిగారి పల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు. బద్వేల్ మండలం తొట్టిగారి పల్లెలో, కోటవీధి, సురేంద్ర నగర్, యూపీహెచ్సీల అంగన్వాడి, ఏఎన్ఎమ్స్, ఆశాలు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు. ఈనెల 28వ తేదీ నుండి 30వ తారీఖు వరకు జరుగు కార్యక్రమం లో భాగంగా మంగళవారం తొట్టి గారి పల్లె లో డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో వాలంటీర్ల ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ జి.రాజేష్ కుమార్ మాట్లాడుతూ మొదటి రోజు బూతులలో, రెండు ,మూడు రోజులలో ఇంటింటి సర్వే చేసి, ఇంకా మిగిలి ఉన్న పిల్లలకు చుక్కలను వేయించాలన్నారు. ఏడు రూట్లలో 70 బూతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అప్పుడే





పుట్టిన బిడ్డనుండే ఐదు సంవత్సరాల పిల్లలందరికీ గతంలో పోలియో చుక్కలు వేపించినప్పటికీ తప్పక పల్స్ పోలియో చుక్కలను వేయించాలన్నారు. ప్రతి పిల్లవాడు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. రాబోయే రోజులలో పోలియో లేని ప్రాంతంగా చేసేందుకు, ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులు, శశివర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ ,ప్రత్యూష ,డిప్యూటీ హెల్త్ డికేటర్ అధికారి వెంగయ్య, డిపిఎంవో శంభు ప్రసాద్, ఐ సి డి ఎస్ సి.డి.పి.ఒ శ్రీదేవి, సిహెచ్ఓ చంద్రావతి, ఉపాధ్యాయులు కంచిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ సులోచన, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుబ్బలక్ష్మి, సువర్ణ ,మానసిక సోషల్ వర్కర్ భాస్కర్, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్ధన్ రావు, సిహెచ్ ఓలు, అంగన్వాడి వర్కర్లు, ఏఎన్ఎంలు ,ఆశాలు పాల్గొన్నారు.

# డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలు యువతకు ఆదర్శం

**దేశ సమైక్యత కోసం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ త్యాగం చిరస్మరణీయం : మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్**

**ఆదోని,జూన్23.అక్షర టైమ్స్:** భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివాస్ ను పురస్కరించుకొని ఆదోనిలో ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు, జిల్లా అధ్యక్షులు అక్కమ్మా తోట రామకృష్ణ ఆదేశాల మేరకు ఆదోని నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రకాష్ జైన్ తన క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాష్ జాయిన్ మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీని తెలిపారు. కాశ్మీర్ ను భారతదేశంలో అంతర్భాగంగా నిలబెట్టేందుకు ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని తెలిపారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో






దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ కలలగన్న బలమైన భారత నిర్మాణం దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు యువరాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలేకర్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు క్షిర సాకిరే వినోద్ కుమార్, బి.నాగరాజ్, యువమోర్చ సీనియర్ నాయకులు సంజయ్ పాండే, మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దీపక్ రాథోడ్, భారతీయ జనత పార్టీ సీనియర్ నాయకులు వాల్మీకి ప్రకాష్ తదితరులు పాల్గొనడమైనది.

# కూటమి ప్రభుత్వంపై యువత గళం - రాయలసీమపై వివక్ష ఎందుకు.?

**హామీలు మరిచిన ప్రభుత్వం - ఉద్యమ బాటలో నిరుద్యోగులు..**

**మంత్రాలయంలో జూన్ 25న నిరసనకు పిలుపు**




**మంత్రాలయం,జూన్23.అక్షర టైమ్స్:-** నిరుద్యోగ యువత సమస్యలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం నాడు మంత్రాలయంలోని స్థానిక అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్, మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ జూన్ 25న జరగనున్న కూటమి ప్రభుత్వ ప్రతినిధుల సభను అడ్డుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**ఎన్నికల హామీలు - అమలులో శూన్యం..**

ఎన్నికల సమయంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని, లేదంటే నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదని వారు మండిపడ్డారు. రెండేళ్లు గడిచినా నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు.

**రాయలసీమపై వివక్ష ఎందుకు.?**

రాయలసీమ జిల్లా తీవ్ర కరువుతో బాధపడుతున్నప్పటికీ, ఈ ప్రాంత అభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రెండు సంవత్సరాల్లో రెండుసార్లు పర్యటించినా, ప్రజలకు ఉపయోగపడే పనులు ఏవీ చేపట్టలేదని వారు విమర్శించారు.

**పరిశ్రమలు లేక - వలసల వెల్లువ..**

ప్రాంతంలో పరిశ్రమలు లేకపోవడం వల్ల యువత ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే వలసలు ఆగుతాయని వారు స్పష్టం చేశారు.

**తీవ్ర హెచ్చరిక సభను అడ్డుకుంటాం..**

ప్రాంతీయ అభివృద్ధిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి. లేకపోతే జూన్ 25న మంత్రాలయంలో జరగనున్న కూటమి ప్రతినిధుల సభను అడ్డుకుంటాం" అని నాయకులు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# మాధవరం సమీపంలో హెలిప్యాడ్,భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన: కలెక్టర్ ఎ.సిరి


**ఆదోని,జూన్23.అక్షర టైమ్స్:-** ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామం సమీపంలో హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గురువారం మంత్రాలయం లో పర్యటించే అవకాశం ఉన్నందున సంబంధించిన అన్ని ఏర్పాట్లు సమన్వయంతో, ఎటువంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. అలాగే హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం కలెక్టర్ హెలిప్యాడ్ ప్రాంతం, సభా వేదిక స్థలం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) మధుసూదన్ రెడ్డి, ఆర్. అండ్.బి ఎస్. ఈ మహేశ్వర రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, తహశీల్దార్ రమాదేవి తదితరులు



పాల్గొన్నారు.

# గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బహిరంగ వేలం

**వేలం పాట ద్వారా దేవస్థానానికి పెరిగిన ఆదాయం**



**చక్రాయపేట,జూన్23.అక్షర టైమ్స్:-** గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో 23-06-2026న బహిరంగ వేలం పాట నిర్వహించారు. దేవస్థానానికి సంబంధించిన పూల టెండర్, టోల్‌గేట్, షాపు రూముల వేలం ప్రక్రియను చేపట్టినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సి. విశ్వనాథ్, ఆలయ చైర్మన్ కల్లూరు వెంకటస్వామిలు తెలిపారు. పూల టెండర్‌ను 01-08-2026 నుంచి 31-07-2027 వరకు ఒక సంవత్సరం కాలానికి నిర్వహించగా, గత ఏడాది రూ.20.05 లక్షలుగా ఉన్న వేలం మొత్తం ప్రస్తుతం రూ.32 లక్షలకు చేరిందని తెలిపారు. చక్రాయపేట మండలం, కొండవాండ్లపల్లి గ్రామానికి చెందిన కే. విజయ్ కుమార్ అధిక పాటదారునిగా నిలిచారని పేర్కొన్నారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే రూ.11.95 లక్షలు (37 శాతం) అదనపు ఆదాయం సమకూరిందన్నారు. టోల్‌గేట్ టెండర్‌లో గత ఏడాది రూ.16.10 లక్షలుగా ఉన్న మొత్తం ప్రస్తుతం రూ.21.05 లక్షలకు చేరిందని తెలిపారు. వేంపల్లె మండలం, కుప్పాలపల్లి గ్రామానికి చెందిన కే. రామగంగిరెడ్డి అధిక పాటదారునిగా నిలిచారని పేర్కొన్నారు. దీంతో రూ.4.95 లక్షలు (23 శాతం) అదనపు ఆదాయం పెరిగిందన్నారు. మూడో టెండర్‌లో మొత్తం 44 షాపు రూములకు గాను 29 షాపు రూములకు వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు. వీటి ద్వారా నెలకు రూ.4.63 లక్షల అద్దె ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. మిగిలిన 15 షాపు రూములకు 30-06-2026న మరోసారి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి విశ్వనాథ్, చైర్మన్ కల్లూరు వెంకటస్వామి తెలిపారు. ఈ బహిరంగ వేలం పాట కార్యక్రమంలో దేవదాయ శాఖ కడప ఇన్‌స్పెక్టర్ శివయ్య, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారి మఠం విద్యుత్ స్ట్రగుల్ కమిటీ నిరసన

**పిఆర్సి కమిటీ వెంటనే వేయాలి**

**కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలి**




**బ్రహ్మంగారిమఠం,జూన్23.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారి మఠం మండల కేంద్రలో గల విద్యుత్ సబ్ స్టేషన్ నందు విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ విద్యుత్ ఉద్యోగుల ఏప్రిల్ 2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో 3కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి, ఉద్యోగులలో, కార్మికులతో వున్న అశాంతిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బ్రహ్మంగారి మఠం స్ట్రగుల్ కమిటీ నాయకులు బ్రహ్మాచారి, నాగ వీరాంజనేయులు, రవీంద్రా నాయక్, కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ: ఏఓ.పవన్ కుమార్



**బండి ఆత్మకూరు,జూన్23.అక్షర టైమ్స్:-** బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు రైతు సేవ కేంద్రంలో యూరియా మండల వ్యవసాయ పవన్ కుమార్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు సేవ కేంద్రం ద్వారా రైతులకు యూరియా డిఏపి ఎరువుల పంపిణీకి ఇండెంట్ చేశామని, యాప్ ద్వారా ఆధార్ అనుసంధానంతో రైతు సేవా కేంద్రాలలో ఎరువుల పంపిణీ చేస్తామని వారు తెలిపారు. ఒకసారి ఎరువులు తీసుకున్న రైతులకు 20 రోజుల వ్యవధి అనంతరం రెండవ దఫా ఎరువులు తీసుకోవడానికి వస్తుందని తెలిపారు. కావున రైతులు ఏ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు నంద్యాల డిఆర్సి ఏడి చెన్నయ్య వ్యవసాయ విస్తరణ సిబ్బంది లక్ష్మయ్య నాన్కి బాయ్ రైతులు పాల్గొన్నారు.

# పెద్ద పేగులో ఉండే వ్యర్థాలను సులభంగా ఇలా బయటకు పంపండి.. ఈ ఆహారాలను రోజూ తీసుకోండి..



మనం తినే ఆహారాలు లేదా తాగే ద్రవాలు ఏవైనా సరే ముందుగా జీర్ణాశయంలో జీర్ణం అవుతాయి. అనంతరం అక్కడి నుంచి ఆహారం చిన్న పేగులకు చేరుతుంది. చిన్న పేగుల్లో ఆహారంలో ఉండే పోషకాలను శరీరం శోషించుకుంటుంది. అక్కడ పోషకాలు పోగా మిగిలిన ఆహారం మలంగా మారుతుంది. అనంతరం అక్కడి నుంచి ఆ మలం పెద్ద పేగు ద్వారా బయటకు వస్తుంది. ఇలా జీర్ణ వ్యవస్థ పనిచేస్తుంది. అయితే ఆహార వ్యర్థాలను బయటకు పంపే పెద్ద పేగు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలి. అందులో ఎలాంటి వ్యర్థాలు పేరుకుపోకూడదు. అలా పేరుకుపోతే మనకు అనేక వ్యాధులు వస్తాయి. పెద్ద పేగులో వ్యర్థాలు పేరుకుపోతే శరీరం విష తుల్యంగా మారుతుంది. దీంతో అనేక రోగాల బారిన పడాల్సి వస్తుంది. కనుక పెద్ద పేగును ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలి. అందుకు గాను పలు ఆహారాలు మనకు ఎంతో దోహదం చేస్తాయి. వాటిని రోజూ తీసుకుంటే పెద్ద పేగును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

**ఫైబర్..**

పెద్ద పేగు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉండాలంటే ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. ఫైబర్ వల్ల మలం గట్టిగా మారకుండా ఉంటుంది. దీంతో అది పెద్ద పేగు నుంచి సులభంగా బయటకు వస్తుంది. కనుక పెద్ద పేగు ఆరోగ్యం కోసం ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఫైబర్ మనకు తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతోపాటు ఓట్స్, పప్పు దినుసులు, శనగలు, బార్లీ వంటి ఆహారాల్లో లభిస్తుంది. కనుక వీటిని రోజూ తీసుకోవాలి. బ్రౌన్ రైస్, బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలను తింటున్నా కూడా ఫైబర్‌ను పొందవచ్చు. అలాగే ప్రొ బయోటిక్ ఆహారాలను తీసుకుంటుంటే పెద్ద పేగుకు ఎంతో మేలు జరుగుతుంది. పెరుగు, మజ్జిగ, పులియ బెట్టిన ఆహారాలు, పాలు ఈ జాబితాకు చెందుతాయి. కనుక వీటిని తీసుకుంటుంటే పెద్ద పేగు ఆరోగ్యంగా ఉంటుంది.

**నీళ్లు..**

ప్రొ బయోటిక్ ఆహారాలను తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు లేకుండా చేస్తుంది. ముఖ్యంగా పెద్ద పేగులో ఉండే వ్యర్థాలను బయటకు పంపుతుంది. దీని వల్ల పెద్ద పేగు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే పెద్ద పేగు శుభ్రంగా ఉండాలంటే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. నీళ్లను తగినంతగా తాగకపోతే పెద్ద పేగులో వ్యర్థాలు అలాగే ఉండి అవి పేరుకుపోతాయి. దీని వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. కనుక నీళ్లను తగినంత మోతాదులో తాగాల్సి ఉంటుంది. పుచ్చకాయలు, తర్బూజాలు, కీరదోస, స్ట్రాబెర్రీలు వంటి పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వీటి వల్ల పెద్ద పేగు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది.

**సూప్‌లు..**

తరచూ వివిధ రకాల సూప్‌లను ఆహారంలో భాగం చేసుకున్నా మేలు జరుగుతుంది. సూప్‌లను సేవిస్తుంటే శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ముఖ్యంగా పెద్ద పేగు శుభ్రంగా మారుతుంది. ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోజూ రెండు పూటలా భోజనానికి ముందు ఒక టీస్పూన్ అల్లం రసం సేవించాలి. ఇది కూడా జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. పొట్ట, పేగుల్లో ఉండే వాపులను తగ్గిస్తుంది. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లేలా చేస్తుంది.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

**రెండు సంవత్సరాల్లో రూ.2.82 కోట్ల సహాయం..**

**348 మంది లబ్దిదారులకు భారీ ఆర్థిక మద్దతు**

**కష్టకాలంలో ప్రాణాధారం "సీఎంఆర్ఎఫ్ "**

**పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

**లబ్దిదారులకు రూ.61లక్షల చెక్కుల పంపిణీ**



**ఎమ్మిగనూరు,జూన్23.అక్షర టైమ్స్:-** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ (జవీ=ఖీ) ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేస్తూ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి మరోసారి ప్రజానుకూలతను చాటుకున్నారు. మంగళవారం నాడు ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక ఆర్‌డబీ అతిథి గృహంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొని ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన 88 మంది లబ్ధిదారులకు రూ.61,23,755 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్, వైద్య రీయింబర్స్‌మెంట్, ౹ూజ ద్వారా ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన 348 మందికి రూ.2.82 కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం సహాయం అందించిందని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి వల్ల ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని అనేక మంది ప్రజలకు కొత్త జీవితం లభిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సలు వంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు ఇది ఆర్థికంగా పెద్ద తోడ్పాటుగా నిలుస్తోందన్నారు. అదే విధంగా పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు అందించిన లయన్స్ క్లబ్

**ఐక్యరాజ్యసమితి ప్రజా సేవా దినోత్సవం పురస్కరించుకుని**

**నంద్యాల రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు రెండు అందజేసిన నంద్యాల లయన్స్ క్లబ్**

**చక్రాల కుర్చీల దాతలు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్**




**నంద్యాల,జూన్23.అక్షర టైమ్స్:-** ఐక్యరాజ్యసమితి ప్రజాసేవ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ కు ప్రయాణికుల సౌకర్యార్థం చక్రాల కుర్చీలు రెండు అందజేశారు.నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, దాతలు నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు భవనాసి నాగ మహేష్ లు చక్రాల కుర్చీలు రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ నిరంతర సేవా కార్యక్రమాలను గత 56 సంవత్సరాలుగా చేస్తున్నదని భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధులకు ఈ చక్రాల కుర్చీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ చంద్రశేఖర్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు,లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మరియు రైల్వే క్రూ కంట్రోలర్ రవి ప్రకాష్, లోకో పైలట్ రామన్న, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఎంపీవి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యూసుఫ్,నూతన కార్యదర్శిగా ఎంపికైన మేడా చంద్రశేఖర్, పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవి పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తులను రక్షించడంలో మంత్రి ఫరూక్ విఫలమయ్యారు: వైసీపీ మైనారిటీ నేతల ధ్వజం

**వక్ఫ్ బోర్డు స్థలాలను ప్రభుత్వ సంస్థలకు కేటాయించడం దారుణం: వైసీపీ**

**ఈద్గాకు చెందిన 10 సెంట్ల స్థలాన్ని కోర్టు కాంప్లెక్స్‌కు ఎలా ఇస్తారు.?: ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా**

**వక్ఫ్ ఆస్తులను రక్షించడంలో మంత్రి ఫరూక్ విఫలమయ్యారు: వైసీపీ మైనారిటీ నేతల ధ్వజం**


**చాబోలు వద్ద 19 ఎకరాల వక్ఫ్ స్థలాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఇవ్వడాన్ని తప్పుపట్టిన వైసీపీ**

**వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం ముస్లింలంతా ఏకం కావాలని పిలుపు**



**నంద్యాల,జూన్23.అక్షర టైమ్స్:-** నంద్యాల జిల్లాలో వక్ఫ్ బోర్డు స్థలాలను ప్రభుత్వ సంస్థలకు కేటాయింపు వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ముస్లిం మైనారిటీల పవిత్ర వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ సంస్థలకు కేటాయించడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వ చర్యలను దారుణంగా అభివర్ణించింది. అల్లా పేరిట ఉన్న స్థలాలను కోర్టు కాంప్లెక్స్, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ మైనారిటీ నేతలు నిప్పులు చెరిగారు. నంద్యాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వక్ఫ్ బోర్డు స్థలాలను ఇతర ప్రభుత్వ సంస్థలకు బదలాయించడంపై వైసీపీ మైనారిటీ విభాగం తిరుగుబాటు జెండా ఎగరేసింది. నంద్యాల స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా అధ్యక్షతన ముస్లిం మైనార్టీ నేతల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నీ సా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, మైనార్టీ నాయకులు జి మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సలముల్లా, గన్నీ కరీం,.ఎం గౌస్, నంద్యాల జిల్లా వైసీపీ జనరల్ సెక్రెటరీ దేవనగర్ బాషా తదితరులు అత్యవసర సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మీజ ఇషాక్ బాషా వైసీపీ నేతలు మాట్లాడుతూ... కౌలూరు గ్రామం ఈద్గా కు చెందిన వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్న పది సెంట్ల స్థలాన్ని కోర్టు కాంప్లెక్స్ ల నిర్మాణానికి కేటాయించడాన్ని వైసీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఎన్.ఎమ్.డి. ఫరూక్.. వక్ఫ్ ఆస్తులను రక్షించాల్సింది పోయి, ఇలా కోర్టుల నిర్మాణానికి రాసివ్వడం ముస్లిం సమాజానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు."ఒక్కసారి అల్లాకు ఇచ్చిన స్థలాలను కేవలం ముస్లింల ప్రయోజనాల కోసం, దైవకార్యాల కోసమే ఉపయోగించాలి. వాటిని అమ్మడం, బదలాయించడం నిషిద్ధం. వక్ఫ్ ఆస్తులను కాపాడలేని మంత్రి ఫరూక్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో మేము నూనెపల్లి జామియా మసీదు ఆస్తులను కాపాడాం. కానీ ఈ కూటమి ప్రభుత్వం చాబోలు గ్రామం వద్ద ఉన్న వక్ఫ్ బోర్డుకు చెందిన 19 ఎకరాల 14 సెంట్ల భూమిని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు, ఆర్మ్డ్ ఫోర్సెస్ కు కేటాయించడం దారుణమని వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం నంద్యాల జిల్లాలోని ముస్లిం మైనార్టీలంతా సంఘటితం కావాలని, ఈ అన్యాయంపై ఎంతవరకైనా వెళ్లి పోరాడతామని వైసీపీ నేతలు హెచ్చరించారు. చట్టపరంగా, సామాజికంగా కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని వారు స్పష్టం చేశారు.

# తొలి తెలంగాణ ఉద్యమ నేత



ఐదు దశాబ్దాల కిందట అనంతుల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో జరిగిన తొలి దశ ఉద్యమం గురించి నేటి తరానికి తెలియకపోవచ్చు. తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడిగా 1968-69లో ఆయన తొలి తెలంగాణ ఉద్యమాన్ని పరుగులు పెట్టించారనే విషయాన్ని నేటి యువత తెలుసుకోవాలి. మదన్ మోహన్ జయంతి సందర్భంగా ఆయన సేవలను తెలంగాణ గడ్డ స్మరించుకోవాలి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాకకు చెందిన అనంతుల మదన్ మోహన్ 1932, నవంబర్ 16న జన్మించారు. మదన్ మోహన్ తండ్రి చక్రపాణి నిజాం హయాంలో కరీంనగర్ జిల్లాలో నాయబ్ తహశీల్దార్‌గా (డిప్యూటీ ఎమ్మార్వో) పనిచేశారు. కొండపాకలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన మదన్ మోహన్, వరంగల్‌లో మెట్రిక్యులేషన్, హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో డిగ్రీ, ఓయూలో ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. 1955-1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలయ్యేసరికి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ సమకాలీన రాజకీయాలను అధ్యయనం చేస్తుండేవారు. అయితే, 1956 నవంబర్ 1న నాటి నెహ్రూ ప్రభుత్వం హైదరాబాద్ స్టేట్‌ను ఆంధ్ర రాష్ట్రంలో కలిపింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచీ తెలంగాణకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు నాటి సీమాంధ్ర పాలకులు. తెలంగాణ ప్రాంతం దోపిడీకి గురవడంతో తెలంగాణలో ఆందోళనలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మేధావులు, యువకులు, సామాజిక కార్యకర్తల నేతృత్వంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్) ఏర్పడింది. యువకుడు, విద్యావంతుడు, మేధావి, న్యాయవాది అయిన అనంతుల మదన్ మోహన్ టీపీఎస్‌కు వ్యవస్థాపక అధ్యక్షుడయ్యారు. ఏప్రిల్ 5న సికింద్రాబాద్‌లో రాష్ట్ర సమైక్యతను కోరుకుంటూనే తెలంగాణకు రక్షణ ఇవ్వాలని బహిరంగసభ నడిపిన కమ్యూనిస్టులకు, తెలంగాణవాదులకు (టీపీఎస్) మధ్య గొడవ జరిగింది. మదన్‌మోహన్‌తోపాటు నాటి విద్యార్థి జేఏసీ ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో తెలంగాణవాదుల అరెస్టుకు నిరసనగా ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో సామూహిక సత్యాగ్రహం జరిగింది. మరోవైపు శాసనసభ్యుడిగా చెన్నారెడ్డి ఎన్నిక చెల్లదని, ఆయన ఆర్నెళ్ల పాటు పోటీ చేయకూడదని 1968 ఏప్రిల్ 26న హైకోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటికే మదన్‌మోహన్ అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమం సమర్థంగా నడుస్తున్నది. కానీ, ఆ ఉద్యమానికి చెన్నారెడ్డి నాయకత్వం వహించాలన్న ఒక వర్గం కుట్రల ఫలితంగా మదన్ మోహన్ టీపీఎస్ పగ్గాలను వదులుకున్నారు. 1969లో టీపీఎస్ నేతృత్వంలో ఉద్యమం ఉధృతం కాగా, పోలీసుల కాల్పుల్లో 369 మంది విద్యార్థులు చనిపోయారు. దీంతో ఉద్యమానికి తాత్కాలిక విరామం ప్రకటించాల్సి వచ్చింది. ఆ తర్వాత 1970లో జరిగిన ఉప ఎన్నికల్లో సిద్దిపేట నుంచి మదన్‌మోహన్ 20 వేల మెజారిటీతో, ఖైరతాబాద్ నుంచి నాగం కృష్ణారావు 15 వేల మెజారిటీతో గెలిచారు. ప్రత్యేక రాష్ట్రం సాధించగలమనే నమ్మకాన్ని టీపీఎస్‌కు ఈ విజయం అందించింది. ఆ తర్వాత మదన్‌మోహన్ 1971 నుంచి 1985 వరకు వరుస గా సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. పీవీ నరసింహారావు, చెన్నారెడ్డి, భవనం వెంకట్రామ్, టి.అం జయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డిల హయాంలో మద న్ మోహన్ వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించా రు.

మదన్ మోహన్ ఉన్నత సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్‌లో జేఎన్‌టీయూ స్థాపితమైంది. ఆయన ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న కాలంలోనే ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్‌సీలు) ఏర్పడ్డాయి. అంతేకాదు, దాదాపు 10 నుంచి 12 వేల మందికి ఆయన వివిధ శాఖల్లో కొలువులు ఇప్పించారు. సిద్దిపేటలో 220 కేవీ సబ్‌స్టేషన్, టీవీ రిలే స్టేష న్, నెహ్రూ యువ కేంద్రాలు, మిల్క్ చిల్లీ సెంటర్, ఇందిరా మహిళా డిగ్రీ కాలేజీలను ఆయన ఏర్పాటు చేశారని సిద్దిపేట ప్రాంతవాసులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు. కొండాపూర్ పీహెచ్‌సీకి తన తండ్రి స్మారకంగా రెండెకరాల భూమిని ఆయన విరాళంగా ఇచ్చా రు. 1990లో ఏపీ పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ గా, 1989లో పీసీసీ జనరల్ సెక్రెటరీగా, ఏఐసీసీ మెంబర్‌గా (శాశ్వత ఆహ్వానితుడిగా) సేవలందించా రు. 1994లో చివరిసారిగా ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 1998లో కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర స్టేట్ ఇంచార్జిగా పనిచేశారు. రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించిన మదన్‌మోహన్ 2004, నవంబర్ 1న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఒక మహోజ్వల ఘట్టం. ఆ పోరాటంలో 369 మంది యువకులు, తొలి తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో క్రియాశీల నాయకుడైన మదన్ మోహన్ నిత్య స్మరణీయులు. నాడు ఉద్యమాన్ని నడిపించిన నేతలు, యువకులు, విద్యార్థులే ఆ తర్వాతి కాలంలో దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. ఆ పోరాటం భవిష్యత్తు కొనసాగింపునకు, స్వరాష్ట్ర కల సాకారమయ్యేందుకు భూమికగా నిలిచింది. అది విస్మృత చరిత్ర కాదు. ఆ చరిత్రను నేడు మనందరం మననం చేసుకోవాలి. (మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా తొలి తెలంగాణ ఉద్యమ నేత మదన్ మోహన్ విగ్రహావిష్కరణ నేడు జరుగుతున్న సందర్భంగా..)